# 4 నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

- భద్రాద్రి దేవస్థానంలో రోజుకో అలంకారంలో దర్శనమివ్వనున్న అమ్మవారు
- 17న శబరి స్మృతి యాత్ర

భద్రాచలం, సెప్టెంబర్ 29: భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వచ్చే నెల 4 నుంచి 12వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించను న్నారు. 12న విజయదశమి సందర్భంగా భద్రాద్రి రామయ్యకు పట్టాభిషేకం, విజయోత్సవం, ఆయు ధపూజ, శ్రీరామ్‌లీలా మహోత్సవం నిర్వహించను న్నారు. అక్టోబర్ 17న శబరి స్మృతియాత్ర సైతం నిర్వహించనున్నారు. ఈ మేరకు అశ్వయుజ మా సంలో నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన నివేదికను ఈవో రమాదేవికి వైదిక బృంద సభ్యులు అందజేశారు. ఈ వివరాలను దేవస్థాన అధికారులు ఆదివారం పత్రికలకు విడుదల చేశారు.

### రోజుకో అలంకారంలో అమ్మవారి దర్శనం..

శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు రోజుకో అలంకారంలో శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారు భక్తులకు దర్శనమివ్వ నున్నారు. అక్టోబర్ 4వ తేదీన ఆదిలక్ష్మి, 5న సంతా నలక్ష్మి, 6న గజలక్ష్మి, 7న ధనలక్ష్మి, 8న ధాన్యలక్ష్మి, 9న విజయలక్ష్మి, 10న ఐశ్వర్యలక్ష్మి, 11న వీరలక్ష్మి, 12న మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిస్తారు. 4 నుంచి 12వ తేదీ వరకు తిరువీధి సేవలు, సంక్షేప రామాయణహవనం నిర్వ హిస్తారు. 17న శబరిస్మృతి యాత్ర, వాల్మీకి జయంతి, 28న లక్ష కుంకుమార్చన, 31న సుద ర్శన హోమం కార్యక్రమాలు ఉంటాయి.



భద్రాద్రి దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వ హించే శ్రీలక్ష్మీతాయారు అమ్మవారి ఆలయం

# మ్యూజియానికి.. మోక్షమెప్పుడో?




ఖమ్మంలోని జిల్లా సైన్స్ మ్యూజియం

- పాత డీఈవో కార్యాలయం కేటాయింపు
- రెండేళ్లు ముస్తాబై ఏడాది పూర్తి..
- నిధుల కొరత లేనే లేదు..
- బిర్లా సంస్థ పరికరాలు అమర్చి మూడు నెలలు..
- అయినా ప్రారంభానికి నోచుకోలేదేమి సారూ?



మ్యూజియంలో సైన్స్ పరికరాలను పరిశీలిస్తున్న డీఈవో, డీఎస్‌వో (ఫైల్)

ఖమ్మం, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని..' అన్న చందంగా ఉంది ఖమ్మం జిల్లా విద్యాశాఖకు చెందిన సైన్స్ మ్యూజియం పరి స్థితి. ఈ మ్యూజియాన్ని సిద్ధం చేసేందుకు గత కేసీఆర్ ప్రభు త్వంలోనే అన్ని చర్యలూ తీసుకున్నారు. కానీ ఇప్పటి వరకు అది అందుబాటులోకి రాలేదు. విద్యార్థులకు ప్రయోగాలతో కూడిన బోధనను అందించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం అవసరమైన చర్యలన్నీ తీసుకుంది. సైన్స్ మ్యూజియం ఏర్పా టుకు పాత డీఈవో కార్యాలయాన్ని కేటాయిస్తూ 2023 జన వరిలో అప్పటి కలెక్టర్ వీపీ గౌతమ్ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతోపాటు రూ.50 లక్షల నిధులను వెచ్చించి ఆగస్టులో మ్యూజియాన్ని తీర్చిదిద్దారు. అయితే మ్యూజియం ముస్తా బైనప్పటికీ దాని ప్రారంభానికి మోక్షమెప్పుడో తెలియని పరి స్థితి ఏర్పడింది.

### ఆచరణలో ఆమడ దూరం...

'సైన్స్ అంటే మక్కువ పెరగాలి. ఫిజిక్స్, బయాలజీ అంటే భయం పోవాలి. పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాలి' అనే మాటలను విద్యాశా ఖాధికారులు పదేపదే వల్లె వేస్తున్నారు. కానీ అమల్లోకి వచ్చేసరికి అవి కార్యాచరణ దాల్చాడం లేదు. మ్యూజి యాన్ని ముస్తాబు చేసి నెలలు గడుస్తున్నా విద్యార్థులకు దాని ఫలాలు అందాలంటే వేచి ఉండాల్సిన పరిస్థితి. ఆశ యాల గురించి గొప్పగా చెప్పే విద్యాశాఖ.. సైన్స్ మ్యూజియం ఆచరణలో మాత్రం ఆమడ దూరంలో ఆగింది. మరోవైపు ఈ మ్యూజియం నిర్వహణకు నిధుల కొరత కూడా లేదు. సీఎస్ఆర్ ఫండ్స్ కింద నివోసాల్ అనే సంస్థ కూడా రూ.20 లక్షలు అందించింది. అయినప్పటికీ అది ఎంకు ప్రారంభానికి నోచుకోవడం లేదో సంబంధిత అధికారులకే తెలియాలి మరి.

### మార్పులు చేసి ఏడాది పూర్తి..

జిల్లాలో సైన్స్ మ్యూజియం ఏర్పాటు దిశగా అప్పటి కేసీ ఆర్ ప్రభుత్వం కృషిచేసింది. 2023 ఆగస్టులోనే పాత డీఈవో కార్యాలయాన్ని సైన్స్ మ్యూజియంగా చేసింది. పరికరాలు ఏర్పాటు చేసేందుకు వీలుగా మార్పులు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌లో మార్పులతోపాటు భవనం చుట్టూ జాలీని ఏర్పాటు చేశారు. ఇందుకు సుమారు రూ.19 లక్షలు కేటా యించారు. పాఠశాల స్థాయిలో విద్యా ర్థుల్లో శాస్త్రీయ దృక్పథాలు, వినూత్న ఆలోచనలు పెంపొందిం చేందుకు వేగంగా నిర్ణయాలు తీసుకుని అమలు పర్చారు. వాటికి సంబంధించిన నిధులను కూడా సైన్స్ ఆఫీసర్, డీఆ ర్‌వో జాయింట్ అకౌంట్‌లో అందుబాటులో ఉంచారు. రూ.50 లక్షలు కూడా అందుబాటులో ఉన్నాయి. వీటి ల్లోంచే మరమ్మతులకు నిధులు కేటాయించి పూర్తి చేశారు.

### సమకూరిన పరికరాలు..

జిల్లాలో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు సైన్స్, సోషల్, గణితంలోని ముఖ్యమైన అంశాలను ప్రయో గాత్మకంగా వివరించేందుకు నిపుణుల ఆధ్వర్యంలో 27 అంశాలను ఎంపిక చేశారు. వీటి కోసం రూ.40 లక్షలు వెచ్చించి పరికరాలను బిగించారు. బిర్లా సంస్థతో చేసుకున్న ఒప్పందం ప్రకారం వారు రెండు విడతల్లో పనులు పూర్తి చేశారు. జూలై మొదటి వారంలో పరికరాలను తీసుకొచ్చి సైన్స్ మ్యూజి యంలో అమర్చారు. తరగతులు వారీగా ఏయే పరి కరాలు ముఖ్యమైనవనే వాటితో పాటు ముఖ్యంగా జీవశాస్త్రంలోని అన్ని పరికరాలకు ప్రాధాన్యం కల్పించారు. ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్ట్ ఫోరం టీచర్లు మ్యూజియం పనుల్లో భాగస్వాముల య్యారు. ఈ సైన్స్ మ్యూజియాన్ని అందుబాటు లోకి తెచ్చేందుకు గత డీఈవోలు ఎంతో శ్రమిం చారు. కానీ ఇప్పటికీ దాని ఫలితాలు విదార్థు లకు అందడం లేదు.

# దేవుడా.. ముఖ్యమంత్రిని మన్నించు..

- రుణమాఫీ చేస్తానంటూ సాక్షాత్తూ మీమీదే ఒట్టు వేశారు..
- ఇప్పుడా ఒట్టును గట్టున పెట్టి మీసాక్షిగా మాట తప్పారు..
- ఇల్లెందులో బీఆర్‌ఎస్ నిరసన.. సీఎంను మన్నించాలని పూజలు
- ఆలయం వద్ద హనుమంతుడి చిత్రపటానికి క్షీరాభిషేకం



హనుమంతుడి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 29: 'దేవుడా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మన్నించు..' అంటూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు భగవంతుడిని వేడుకున్నారు. 'ఆగస్టు 15లోపు రైతు లందరికీ రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తానంటూ సాక్షాత్తూ మీమీదే ఒట్టు వేసిన ముఖ్యమంత్రి.. ఇప్పుడు ఆ ఒట్టును గట్టున పెట్టారు. మీ సాక్షిగా ఇచ్చిన మాటను తప్పారు. మీమీదే ఒట్టు వేసి మాట తప్పిన ముఖ్యమంత్రిని మీరే పెద్ద మనసుతో క్షమించండి' అంటూ పూజలు చేశారు. పంట రుణాల రుణమాఫీ అంశంపై మాట తప్పిన ముఖ్యమంత్రిని మన్నిం చాలంటూ భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండల బీఆ ర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలోని ఒడ్డు గూడెం గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద హనుమంతుడి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. 'రుణమాఫీ విషయంలో రైతులనేగాక సాక్షాత్తూ మిమ్ములను కూడా మోసం చేశారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 'సాక్షాత్తూ ముఖ్యమం త్రిగా ఉన్న వ్యక్తి.. తాను ఇచ్చిన మాటను నెరవే ర్చలేదు. అటు రైతులను, ఇటు మిమ్ములను మోసం చేశారు. మీరే దయ చూపి ఆయనను క్షమించండి' అంటూ వేడుకున్నారు. రాష్ట్ర ప్రజ లందరినీ కాపాడాలని, ఆయురారోగ్యాలతో ఉంచాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీఆ ర్‌ఎస్ సోషల్ మీడియా విభాగ మండల ఇన్‌చార్జి భూక్యా సురేశ్‌నాయక్, ఉద్యమ నాయకులు, బీఆ ర్‌ఎస్ నేతలు అజ్మీరా భావ్‌సింగ్, పూనెం లింగమ్మ, జోగా శేషగిరి, సుజాత్, ఘాజీ, అజ్మీరా రాందాస్, జాన్‌బాబు, భూక్యా శ్రీను, రామకృష్ణ, స్వామి, అశోక్, మంగీలాల్, ధర్మ, వీరు, వెంకన్న, రాములు, వీరయ్య, భద్రయ్య, శంకర్, ప్రేమ్, రాకేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సెల్ఫీలతోనే సరిపెట్టేస్తారా?

- 'మిగిలిన రైతుల' రుణమాఫీపై ప్రభుత్వం నుంచి స్పష్టత కరువు
- ఆగస్టు 15నే ప్రక్రియ పూర్తయినట్లు చెప్పి చేతులు దుపులుకున్నట్లేనా?
- రోజుల తరబడి కొనసాగుతున్న 'కుటుంబ నిర్ధారణ' ప్రక్రియ
- అర్హత తేల్చేదెన్నడు? మాఫీ చేసేదెప్పుడు? మళ్లీ రుణాలు ఎప్పుడు?
- దమ్మపేట మండలంలో సుమారు 3,300 మందికి కాని రుణమాఫీ
- 2,800 మందికి 'ఫ్యామిలీ గ్రూపింగ్' పూర్తి.. 500 మందికి పెండింగ్
- దూరప్రాంతాల్లో ఉండడమే ఆలస్యానికి కారణమంటున్న అధికారులు



దమ్మపేట రైతువేదిక వద్ద ఫ్యామిలీ గ్రూపింగ్‌లో భాగంగా సెల్ఫీ తీస్తున్న ఏవో చంద్రశేఖర్‌రెడ్డి

దమ్మపేట, సెప్టెంబర్ 29: 'ఆరు నూరైనా 2024 ఆగస్టు 15లోగా రూ.2 లక్షల లోపున్న రుణాలను మాఫీ చేస్తాం. ఈ విష యంలో మాట తప్పేదిలేదు. మడమ తిప్పేది లేదు.' అంటూ గొప్పలు చెప్పిన కాంగ్రెస్ సర్కారు.. ఆచరణలో అంతా ఒట్టిదే చేసింది. కుటుంబ నిర్ధారణ ద్వారా రైతుల అర్హతను తేల్చుతామంటూ చెప్పింది. ఇందుకోసం రుణ మాఫీ కాని రైతుల ఇంటికి వ్యవసాయ అధికా రులు వెళ్లి సెల్ఫీలు దిగి ఆ ఫొటోను, రైతుల వివ రాలను ప్రభుత్వ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఆగస్టు 15 తరువాత మొదలైన ఈ ప్రక్రియ రెండు నెలలు కావస్తున్నా రోజుల తరబడి కొనసా గుతూనే ఉంది. దీంతో 'సెల్ఫీలతోనే సరిపెట్టే స్తారా?' అంటూ అర్హులైన రైతులందరూ అను మానం వ్యక్తం చేస్తున్నారు. మూడు విడతల్లోనూ రుణమాఫీ కాకుండా మిగిలిన రైతుల పంట రుణాల మాఫీ విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత లేక పోవడమే ఇందుకు కారణమంటూ చెబుతున్నారు. రుణమాఫీ ప్రక్రియ ఆగస్టు 15నే పూర్తయినట్లు చెప్పిన ప్రభుత్వం ఆ తర్వాత చేతులు దుపులుకుం దంటూ ఆరోపిస్తున్నారు. 'మా అర్హత తేల్చేదెన్నడు? రుణమాఫీ చేసేదెప్పుడు? తిరిగి పంట రుణాలు ఇచ్చేదెన్నడు?' అంటూ నిట్టూరుస్తున్నారు. ఉదాహ రణకు భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలాన్ని పరిశీ లిస్తే అక్కడి పరిస్థితి అర్థమవుతోంది.

దమ్మపేట మండలంలో సుమారు 11,300 మంది రైతులు రుణమాఫీకి అర్హులంటూ ప్రభు త్వమే తేల్చింది. అయితే అనేక కారణాలు చెబుతూ వీరిలో సుమారు 3,300 మందిని రుణ మాఫీకి దూరం చేసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తామంతా రుణమాఫీకి అర్హులమే నంటూ ఈ రైతులందరూ గగ్గోలు పెట్టడంతో ప్రభుత్వం మరో ప్రకటన చేసింది. సాంకేతిక కార ణాలతోపాటు ఇతరత్రా పొరపాట్ల వల్ల వీరికి రుణమాఫీ కాలేదని చెప్పింది. వ్యవసాయ శాఖ అధికారులు ఈ రైతుల ఇంటి వద్దకే వచ్చి వీరి అర్హ తను నిర్ధారిస్తారని చెప్పింది. దీంతో అధికారులం దరూ తొలినాళ్లలో రుణమాఫీ కాని రైతుల ఇంటి బాట పట్టారు. ఆ తరువాత రైతువేదికల వద్దనే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఈ ప్రక్రియ మొదలై కూడా రెండు నెలలు గడుస్తున్నాయి. అయితే ఫ్యామిలీ గ్రూపింగ్ ప్రక్రియ ఇంకా ముగి యలేదు. ఇంకా 500 మంది రైతు కుటుంబాల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందంటూ అధికారులు చెబుతున్నారు.

### అయోమయంలో అన్నదాతలు..

అయితే, సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కాని వారిలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామంటూ రెండు నెల లుగా చెబుతూ వస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. గ్రూపింగ్ సర్వే పేరుతో సరిపెడుతోంది తప్ప ఆచరణలో మాఫీపై మాట్లాడడంలేదంటూ అన్న దాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు 'రుణమాఫీ చేస్తుందా? లేదా?' అంటూ అయోమయానికి గురవుతున్నారు. కాగా, దూర ప్రాంతాల్లో ఉంటున్న కొందరు రైతులు ఫ్యామిలీ గ్రూపింగ్ కోసం హాజరుకాలేకపోతున్నారు. దీంతో ఈ ప్రక్రియ మరికొంత ఆలస్యమవు తోంది. కాగా, మండలంలో ఇంకా 3,300 మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా.. వారిలో 2,800 మంది రైతుల ఫ్యామిలీ గ్రూపింగ్ ప్రక్రియ పూర్తయింది. ఇంకా సుమారు 500 మంది రైతుల ఫ్యామిలీ గ్రూపిం గ్‌ను నిర్ధారించి సెల్ఫీలు దిగాల్సి ఉంది.

## ఆయిల్‌పాం సాగుతో..

# దీర్ఘకాలిక నికర ఆదాయం

- ఆసక్తి ఉన్న రైతులు ముందుకు రావాలి
- ఆయిల్‌ఫెడ్ డివిజనల్ ఆఫీసర్ బాలకృష్ణ



మాట్లాడుతున్న ఆయిల్ ఫెడ్ డీవో బాలకృష్ణ

అశ్వారావుపేట, సెప్టెంబర్ 29: దీర్ఘకాలిక నికర ఆదాయం అందించే ఆయిల్‌పాంను సాగు చేసేందుకు రైతులు ముందుకు రావా లని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ సూచించారు. మొక్కలతో సహా నాలుగేళ్ల పాటు నిర్వహణ ఖర్చులను కూడా ఉద్యాన శాఖ ద్వారా సబ్సిడీపై అందిస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు ఆదివారం ఇక్కడి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావే శంలో మాట్లాడారు. రాయితీపై డ్రిప్‌ను మంజూరు చేస్తున్నామని, దళారీ వ్యవస్థ లేకుండా పంటను నేరుగా ఆయిల్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందని, ఇందుకు రవాణా ఖర్చులను కూడా చెల్లిస్తోందని వివరించారు. నెల రోజుల ముందుగానే ధర ప్రకటించి ఆ తరువాత రోజుల వ్యవధిలోనే చెల్లింపు లను పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా సాగు చేసే రైతులకు అవసరమైన ఆయిల్ పాం మొక్కలు అందుబాటులో ఉన్నా యన్నారు. ఇతర పంటలకు లేని కనీస ధర ఆయి ల్‌పాం రైతులకు అందుతుందని అన్నారు.

## కొత్తగూడెంలో

# జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్

ప్రారంభించిన అటవీశాఖ వరంగల్ చీఫ్ కన్జర్వేటర్ భీమానాయక్



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న చీఫ్ కన్జర్వేటర్ భీమానాయక్

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 29: అటవీ శాఖ భద్రాద్రి జోనల్ స్థాయి స్పోర్ట్స్‌మీ ట్‌ను చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు వరంగల్ డి.భీమా నాయక్ ఆదివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిం చారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఆయన హాజరై పతాకావిష్కరణ చేసి బెలూన్లను ఎగురవేశారు. అనంతరం మార్చ్‌ఫాస్ట్ నుంచి గౌరవ వం దనం స్వీకరించారు. వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన జిల్లా అటవీ అధికారి నుంచి ఫారెస్టు బీట్ ఆఫీసర్ స్థాయి అధికారుల వరకూ అందరూ వివిధ ఆటల్లో పాల్గొన్నారు. సోమవారంతో ఈ పోటీలు ముగుస్తాయి. ఆటల్లో ప్రతిభ కనప ర్చిన ఉద్యోగులకు బహుమతులు అందజేసి రాష్ట్రస్థాయిలో జరగబోయే స్పోర్ట్స్ మీట్‌కు ఎంపిక చేయను న్నారు.

# కాలువ నిండా నీళ్లు... ఎండిపోతున్న పొలాలు

తలాపున నీళ్లు వెళ్తుండగా.. కింద వరి పొలాలు ఎండిపోతు న్నాయి. ఇప్పటివరకు ఎన్నడూ లేనివిధంగా ఖమ్మంజిల్లా కల్లూరు, పెనుబల్లి మండ లాల్లో ఎన్నెస్పీ కాలువ లిఫ్ట్ ఇరిగేషన్ ఆయకట్టులో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఆరునెలల క్రితం లిఫ్ట్‌లకు ఉన్న ట్రాన్స్‌ఫారాలు దొంగల భారినపడ్డాయి. వెంటనే రైతులు సంబంధిత అధికారులు, పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. కానీ అప్పటినుంచి దాన్ని పట్టించుకున్న నాథుడే లేడు. దీంతో నేడు చూస్తుండగానే వరి పొలాలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. కర్రాలపాడు, తాళ్ల పెంట ఎత్తిపోతల పథకం ఎదురుగానే కాలువ నిండా నీళ్లు పారుతున్నాయి. కానీ లిఫ్ట్ వెనుకనే వరి పొలాలు నెర్రెలు వారి కనిపిస్తున్నాయి. వరి పంటలన్నీ పొట్ట దశలో ఉండి ఎండిపోతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవిం చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 'ఎన్నెస్పీ జలాలులేక పంటలు ఎండిపోతున్న వేళ ఈఎ న్‌సీతో చర్చించి నీళ్లు అందించి వరిని కాపాడిన ఘనత గత ప్రభుత్వానిది అయితే.. నీళ్లుండి కూడా పంటలను కాపాడలేని దౌర్భాగ్య దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వా నిది' అనేందుకు ఇదే నిదర్శనం.

-పెనుబల్లి, సెప్టెంబర్ 29

కల్లూరు, పెనుబల్లి మండలాల్లో విచిత్ర పరిస్థితి



ఎన్నెస్పీ కాలువ నిండా ఉన్న నీళ్లు



అదే కాలువ కింద నెర్రెలు వారిన వరి పొలం





మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616